సాక్షి అనకాపల్లి

బుధవారం : 10 : జూలై : 2024



కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



అష్టదళ పద్మారాధన

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.8/25.5

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

వరాహావతారంలో జగన్నాథుడు



అనకాపల్లి: జగన్నాథ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామి వారు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రమేష్, అనకాపల్లి మోహనరావు, బొడ్డేడ వెంకట చలపతిరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ సీట్ల భర్తీ నేడు



ప్రిన్సిపాల్ శివ

కశింకోట: కశింకోటలోని పూర్వ ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం కోటా సీట్ల భర్తీకి బుధవారం ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.శివ మంగళవారం విలేకరులకు తెలిపారు. కళాశాలలో 4 బ్రాంచ్‌లున్నాయన్నారు. మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచుల్లో ఒక్కొక్కదానిలో 30 వంతున సీట్లు ఉన్నాయన్నారు. వీటి కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జెరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్‌కు నిర్దేశించిన సమయానికి హాజరు కావాలన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెడ్‌ను ఈ కౌన్సెలింగ్‌కు పర్యవేక్షణ అధికారిగా నియమించారన్నారు. వివరాలకు 906397220, 9505504220, 08924-22037 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

వాయిదా పడిన పరీక్ష రేపు నిర్వహణ

ఏయూ క్యాంపస్: విద్యార్థి సంఘాల బంద్ కారణంగా ఈ నెల 4న వాయిదా పడిన డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను గురువారం నిర్వహించనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నాలుగో సెమిస్టర్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు తదనుగుణంగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బదిలీ

- ఏపీటీఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం

విశాఖ సిటీ: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ బదిలీ అయ్యారు. ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యా రు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన స్థానంలో జీవీఎంసీ కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు. బాధ్యతలను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్‌కు అప్పగించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాయికాంత్ వర్మ 2023 ఏప్రిల్ 15న జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సాయికాంత్‌వర్మ విశాఖ అభివృద్ధి, సుందరంగా తీర్చి దిద్దడంలో కీలక పాత్ర పోషించారు.

ఇసుక దుమారం



నక్కపల్లి డిపో వద్ద ఇసుక విక్రయాలు ప్రారంభించిన దృశ్యం

ధర వసూలు చేస్తూ.. ఉచితం అనడం సముచితమేనా? ఇదీ అసంతృప్తి, ఆగ్రహాలతో ప్రజలు చేస్తున్న వ్యాఖ్య. ఫ్రీ ఇసుక అని ఊదరగొట్టి చివరకు ఇలా చేశారేమిటని రుసరుసలాడుతున్నారు. దాదాపుగా గతంలో ఉన్న చార్జీలనే ఇప్పుడూ వసూలు చేస్తున్నారు.. తేడా ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దానికి తోడు ఇసుక దోపిడీ ఒకటి. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇసుక నిల్వలు తరలిపోయాయని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వర్షాలు పడి తవ్వకాలు నిలిచిపోయి ఇసుక లభ్యం కాక ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో ఈసారి ఆ సమస్య లేకుండా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే స్టాక్ పాయింట్ల వద్ద భారీ స్థాయిలో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచారు. ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ మారిపోయింది. నెల రోజుల వ్యవధిలో రూ.5.75 కోట్ల విలువైన 56 వేల మెట్రిక్ టన్నుల ఇసుక దోపిడీకి గురైంది. మొత్తం ఈ వ్యవహారంపై దుమారం రేగుతోంది.

- చెప్పిందొకటి.. చేసిందొకటి
- ఉచితమంటూనే ధర వసూలు
- గతంతో పోలిస్తే దాదాపుగా అంతే ఖర్చు
- నిరాశకు లోనైన వినియోగదారులు
- మందకొడిగా కొనుగోళ్లు

నక్కపల్లి, అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమిలి, అగనంపూడి, నర్సీపట్నం (గబ్బాడ), నక్కపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఉచితం పేరుతో చేసిన ప్రచారం నమ్మిన ప్రజలు కంగు తింటున్నారు. కొనేవారు లేక ఈ డిపోలు వెలవెలబోతున్నాయి. నక్కపల్లి ఇసుక డిపో వద్ద గతంలో టన్ను ఇసుకను రూ.1,200కు విక్రయిస్తే, ప్రస్తుత ధర రూ.1,225గా నిర్ణయించారు. దీనికి రవాణా చార్జీలు అదనం. నక్కపల్లి నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలించడానికి 5 కిలోమీటర్లు లోపయితే రూ.500, దాటితే రూ.1,000 రవాణా చార్జీ వసూలు చేస్తారు. అగనంపూడిలో గతంలో ఇసుక ధర రూ.1,400. ప్రస్తుతం రూ.1,394. కేవలం రూ.6 మాత్రమే వ్యత్యాసం. రవాణా చార్జీల్లో గతానికి, ఇప్పటికి మార్పులేదు. అగనంపూడి డిపో నుంచి గాజువాకకు ట్రాక్టర్ కిరాయి రూ.1,600. ఈ లెక్కన ట్రాక్టర్ లోడ్ ఇసుక బుక్ చేసుకుంటే గతంలో రూ.8,600 అయితే ప్రస్తుతం రూ.8,570 అవుతుంది. కేవలం రూ.30 మాత్రమే వ్యత్యాసం. లారీ లోడ్‌కు కేవలం రూ.60 మాత్రమే తక్కువ. ఈమాత్రం దానికి కొత్త ఇసుక పాలసీ అని గొప్పలు ఎందుకని విమర్శలు వినిపిస్తున్నాయి. భీమిలి ఇసుక ర్యాంపులో 50 వేల టన్నులపైనే ఇసుకను నిల్వ చేశారు. ఇక్కడ ఇసుక నిల్వల్లో ఎలాంటి తేడాల్లేవు. కూటమి ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.758గా నిర్ణయించింది. ఈ ధర గతంలో కంటే రూ.300 తక్కువ. నర్సీపట్నంలో గత ప్రభుత్వం లక్ష టన్నుల మేర ఇసుకను నిల్వ చేసింది. ప్రస్తుతం ఇక్కడ కేవలం 48,204 టన్నుల ఇసుక మాత్రమే ఉంది. 50 వేల టన్నులకు పైనే ఇసుక మాయమైనట్లు ఆరోపణలున్నాయి. ఇదంతా ఫలితాలు వెల్లడైన నెల రోజుల్లోనే జరిగినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.5 కోట్లుకు పైగా గండి పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి నాలుగేళ్లు టన్ను ఇసుక రూ.1,250కు విక్రయించారు. చివరి ఏడాది కాంట్రాక్టర్ మారడంతో ఆ ధర రూ.1,400 చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇక్కడ టన్ను ఇసుక ధర రూ.1,225గా నిర్ణయించింది.

యథేచ్ఛగా దోపిడీ

ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు గత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గోదావరి, కృష్ణా, వంశధార, తుంగభద్ర నదుల్లో లభించే ఇసుకను వినియోగదారులకు నామమాత్రపు ధరలకు ప్రభుత్వమే విక్రయించేలా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో ప్రత్యేకంగా డిపోలు ఏర్పాటు చేసింది. గోదావరి నది నుంచి నాణ్యమైన ఇసుకను ఇక్కడకు తరలించి ఎంపిక చేసిన ప్రైవేటు ఏజెన్సీల ద్వారా విక్రయాలు చేపట్టింది. భూగర్భ గనుల శాఖ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో ముందుగా బుక్ చేసుకున్నవారికి మాత్రమే ఇసుక సరఫరా చేసేవారు. ఈ విధానం వల్ల ఇసుక పక్కదారి పట్టకుండా ఉండటంతోపాటు ప్రభుత్వానికి కూడా ఆదాయం లభించేది. ఇలా నాలుగేళ్లపాటు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేసింది. తాము అధికారంలోకి వస్తే నూతన ఇసుక పాలసీని అమల్లోకి తెస్తామని, ఉచితంగా సరఫరా చేస్తామంటూ టీడీపీ కూటమి ఎన్నికల ముందు వాగ్దానం చేసింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు జూలై 8 నుంచి నూతన ఇసుక పాలసీ అమలు చేస్తామని కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఉచితంగా ఇస్తున్నట్టు అధికార పక్షం ఊదరగొట్టింది. కానీ చేతల్లో మాత్రం వేరే విధంగా ఉంది. దానికి తోడు ఇసుక దోపిడీ ఒకటి. నక్కపల్లి ఇసుక డిపో వద్ద ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 32 వేల టన్నుల ఇసుక నిల్వ చేసినట్లు అధికారిక సమాచారం. ఎన్నికల ఫలితాల తర్వాతి నుంచే ఇక్కడ ఇసుక దోపిడీ మొదలయింది. అధికారుల అండదండలతో కూటమి నేతలు ఇసుకను తరలించుకుపోయారు. ఈ నెల 2న స్థానికులు అడ్డుకోవడంతో బండారం బయటపడింది. తాజా లెక్కల్లో 6 వేల టన్నుల ఇసుక మాయమైనట్లు అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. దీని విలువ సుమారు రూ.75 లక్షలుగా తేల్చారు. అయితే మాయమైన ఇసుక 12 వేల టన్నులకు పైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నర్సీపట్నం గబ్బాడ యార్డులో కూడా పెద్ద ఎత్తున ఇసుక మాయమైందన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల ఫలితాలకు ముందు ఈ యార్డులో లక్ష టన్నుల ఇసుక ఉండేదని, ఫలితాలు వెలువడిన మరుసటి రోజే టీడీపీ నాయకులు యార్డును స్వాధీనం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ ఆరోపించారు. లక్ష టన్నులు ఉండాల్సిన ఇసుక ప్రస్తుతం 48 వేలే ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యార్డులోని రూ.5 కోట్లు విలువ చేసే ఇసుకను వాహనాల్లో తరలించి టీడీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారన్నారు. యార్డులోని 60 వేల టన్నుల ఇసుకను మాయం చేశారన్నారు. గబ్బాడ ఇసుక దోపిడీపై అధికారులు సమగ్రమైన విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయంటున్నారు.



అగనంపూడి ఇసుక డిపో వద్ద ఇసుకను లారీల్లో లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న పొక్లెయిన్

రెండో రోజు 17 టన్నులే..

నక్కపల్లి డిపోలో ఇసుక విక్రయాలు సోమవారం నుంచి ప్రారంభించారు. తొలిరోజు ఎవరూ కొనుగోలుకు ముందుకు రాలేదు. రెండో రోజైన మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం 17 టన్నులు మాత్రమే ఇసుక విక్రయాలు జరిగినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మైనింగ్, పంచాయతీరాజ్, పోలీసు, సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్ర వరకు డిపో వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. నర్సీపట్నంలో ఇంకా విక్రయాలే ప్రారంభం కాలేదు.

ఇదెక్కడి న్యాయం?



ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని ఓట్లేయించుకున్నారు.. తీరా అధికారంలోకి వచ్చాక మరో విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. నక్కపల్లి డిపో నుంచి టన్ను రూ.1225లకు కొనుక్కోవాలని ప్రభుత్వం చెబుతోంది. ఇదెక్కడి న్యాయం? గత ప్రభుత్వంలోనే టన్ను రూ.1200లకు విక్రయించారు. ఇప్పుడు ఫ్రీగా ఇవ్వకపోగా గతంలో కంటే టన్నుకు రూ.25 లు అధికంగా వసూలు చేయడం భావ్యం కాదు. ఉచితంగా ఇస్తారని నమ్మి చాలామంది ఇంటి నిర్మాణ పనులు ఆరు మాసాలు వాయిదా వేసుకున్నారు. తీరా ఇప్పుడు డబ్బులు కట్టి తీసుకెళ్లాలంటున్నారు. నేను ఈరోజు 5 టన్నులు రూ.6,125లకు కొనుగోలు చేశాను. దీనికి రవాణా చార్జీలు వెయ్యి రూపాయలు అదనం.

–ఇసరపు శ్రీను, వినియోగదారుడు, పెనుగొల్లు, అనకాపల్లి జిల్లా

ఉచితం అంటే ఇదేనా...

ఉచితమని ఊరించారు. తీరా ఇసుక విధానం ప్రకటించిన తరువాత అసలు విషయం బోధపడింది. గతానికి భిన్నంగా ధరలు ఉంటాయనుకున్నాం. ఇంతలా భవన నిర్మాణదారులను, తాపీ పనివారిని మోసం చేస్తారనుకోలేదు. తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంప్‌ల నుంచి ఇసుక అగనంపూడి డిపోకు తరలించడానికి టన్నుకు రూ.1396 వ్యయం అవుతుందంటే నమ్మశక్యంగా లేదు. కేవలం రవాణా చార్జీలే వసూలు చేస్తే ఇంత మొత్తం అవసరం లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

–పి.పి.రామారావు, భవన నిర్మాణ కాంట్రాక్టర్, రాజీవ్‌నగర్, గాజువాక

పంట సాగులో సస్య రక్షణ చర్యలు

- చెరకు పైరులో మొవ్వ కుళ్లు తెగులుపై రైతులు అప్రమత్తం
- వ్యవసాయ శాస్త్రవేత్తల సమావేశంలో ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు



ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు

అనకాపల్లి: చెరకు పైరులో మొవ్వకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున లీటరు నీటికి కార్బెండిజమ్ 1 గ్రాము, లేదా మాంకోజెబ్ 3 గ్రా. కలిపి తెగులు ఉధృతిని బట్టి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయడం ద్వారా నివారించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 రోజులు దాటిన వర్షాధార చెరకులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పీక పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ., లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాగల వర్షాలను వినియోగించుకుని వరి పైరు విత్తుకునే రైతులు ఆర్‌జీఎల్-2537, బీపీటీ-5204, 3291, ఎంటీయూ-1262, 1318, 1064, 1121, 1224 వంటి రకాలను సేకరించి, మొలక శాతం చూసుకుని, ఎకరానికి 25-30 కిలోల విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. నేరుగా వరి విత్తే పద్ధతిలో కలుపు సమస్య అధికంగా ఉంటుందన్నారు. ఆలస్యంగా వేసిన వరిలో ప్రేటిలక్లోర్ కలుపు మందును ఎకరానికి 600 మి.లీ. లేదా పెండిమిథాలిన్ 38.7 శాతం సీఎస్ 700 మి.లీ. చొప్పున వరి విత్తిన వెంటనే పిచికారి చేసుకోవాలని సూచించారు. 20 రోజుల వయసుండి నేరుగా విత్తిన వరి పైరులో గడ్డి, వెడల్పాటి కలుపు సమస్య ఉంటే బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లీ.లు చొప్పున పిచికారీ చేయాలన్నారు. గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉంటే ఫెనోక్సాప్రోప్ పిఇథైల్‌ను 350 మి.లీ. ల చొప్పున ఎకరా పొలానికి పిచికారీ చేస్తే, మేలన్నారు. 25-30 రోజుల వయసు గల నేరుగా విత్తిన వరి పైరులో వర్షాల వలన కలుపు సమస్య పెరిగుతుందన్నారు. దీనినివారణకు 2, 4-డి అమైన్ సాల్ట్ 58 శాతం ఇ.సి. 2 మి.లీ., 10 గ్రా.ల యూరియాను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. లేకుంటే ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు 8 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసినా ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, టి.శ్రీలత, ఎం.విశాలక్ష్మి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

గోవాడ అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు

- మామూళ్ల మత్తులో ఐసీడీఎస్ అధికారులు
- కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు డిమాండ్



కుళ్లిపోయిన కోడిగుడ్డు

చోడవరం: ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రాణసంకటంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరికిచ్చే పౌష్టికాహారంలో నాణ్యత లోపించడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పౌష్టికాహారం సరఫరాలో లోపాలను పరిశీలించాల్సిన ఐసీడీఎస్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా చోడవరం మండలం గోవాడ అంగన్‌వాడీ కేంద్రం-2లో కుళ్లిన కోడిగుడ్ల విషయం వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఇక్కడ సిబ్బంది కోడిగుడ్లు ఉడికించేందుకు సిద్ధం చేయగా, వాటిలో కొన్ని పగిలిపోయి కుళ్లిపోయి కనిపించాయి. దీంతో సిబ్బంది వాటిని పక్కన పెట్టారు. మిగతా గుడ్ల నాణ్యతపై భయపడి ఉడికించలేదు. ఉడికించక ముందే గుడ్లు పగలడం వల్ల అవి కుళ్లినట్లుగా తెలిసింది. లేని పక్షంలో ఉడికించి పెట్టేసేవారు. అదే జరిగితే పిల్లలు అనారోగ్యం బారిన పడేవారని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రావికమతం ఐసీడీఎస్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే కోడిగుడ్ల నాణ్యత లోపంపై గతంలో పలుమార్లు వెలుగుచూసినా ఇక్కడి అధికారులు మాత్రం ఏమీ పట్టించుకోలేదు. వీటిని సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. తాజాగా గోవాడ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్ల వ్యవహారంపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఐసీడీఎస్ వెంకన్నపాలెం క్లస్టర్ సూపర్‌వైజర్ అనిత స్పందిస్తూ ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీలో అల్ట్రా సౌండ్ స్కానింగ్



పీహెచ్‌సీలో గర్భిణికి నిర్వహిస్తున్న స్కానింగ్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇక నుంచి ప్రతి నెల గర్భిణులకు ఉచితంగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.వి.ఎస్.కె.బాలాజీ చెప్పారు. తాళ్లపాలెం పీహెచ్‌సీని మంగళవారం సందర్శించి అక్కడ నూతనంగా సమకూర్చిన అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత గర్భిణులకు ఉపయోగపడే విధంగా స్కానింగ్ సదుపాయం కల్పించామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ మాట్లాడుతూ యలమంచిలి సీహెచ్‌సీ గైనికాలజిస్టు కె.మోనిక వచ్చి ప్రతి నెల 9న గర్భిణులకు ఉచిత స్కానింగ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.విప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి.సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎస్.ఆర్.కె.జి.నరసింహారావు, ఆరోగ్య కార్యకర్త ఆర్.వి.వి.సత్యనారాయణ, సిబ్బంది పాలొన్నారు.

ముఖ్యమంత్రి రాక రేపు

- దార్లపూడిలో పోలవరం పనులు పరిశీలించనున్న సీఎం
- ఏర్పాట్లపై జిల్లా అధికారులతో హోం మంత్రి సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి: సీఎం నారా చంద్రబాబునాయుడు ఈ నెల 11న జిల్లాలో పర్యటించనున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో హోం మంత్రి సమీక్షించారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని చెప్పారు. హెలిప్యాడ్ ఏర్పాటు, ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో బందోబస్తు తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులకు సంబంధించిన వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటన ఏర్పాట్లలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ కె.వి. మురళీకృష్ణ, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు ఎ.జె.చిన్నికృష్ణ, జయరాం పాల్గొన్నారు.

దార్లపూడి హైస్కూల్లో హెలిప్యాడ్

ఎస్.రాయవరం: చంద్రబాబునాయుడు సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఈ మేరకు మండలంలోని దార్లపూడి ఉన్నత పాఠశాల మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు పరిశీలిస్తారన్నారు. స్థానిక నాయకులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి 17 మందికి అస్వస్థత

- నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ఘటన
- అనకాపల్లికి బాధితుల తరలింపు
- ప్రాణాపాయం లేదని వైద్యుల వెల్లడి



అనకాపల్లి ఆస్పత్రిలో చిన్నారికి చికిత్స



అంబులెన్స్‌లో బాధితుల తరలింపు



అనకాపల్లి ఆస్పత్రిలో బాధితులకు చికిత్స

నక్కపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 17 మంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వీరందరినీ హుటాహుటిన అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. వారు కోలుకుంటున్నారని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. గత రెండు రోజుల నుంచి వివిధ గ్రామాలకు చెందిన పలువురు జ్వరాలు, వాంతులతో నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరందరినీ ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. మంగళవారం రాత్రి వీరికి సెఫోటాక్సిమ్ ఇంజక్షన్ చేశారు. చేసిన కొద్ది నిమిషాలకే వీరందరికీ తీవ్రమైన చలి, వణుకు వచ్చి వాంతులు ప్రారంభమయ్యాయి. ఇంజక్షన్ వికటించడం వల్లే ఈవిధంగా జరిగిందని భావించిన స్థానిక ఆస్పత్రి సిబ్బంది వీరందరినీ అంబులెన్స్‌లలో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురయిన వారి లో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు కూడా ఉన్నారు. బాధితుల్లో డి.నూకరాజు (జా నకయ్యపేట), వి.అప్పారావు (చిన వెదుళ్లపాలెం), డి.వీర్రాజు (జానకయ్యపేట), కె.సింహాచలం (బుచ్చిరాజుపేట), వి.సునీత (తిమ్మాపురం), సిహెచ్.కన్నతల్లి (సన్యాసిరాజుపాలెం) తదితర పెద్ద లు ఉన్నారు. ఇక చిన్నపిల్లల్లో వై.ఆదిత్య (రేవుపోలవరం), కె.దివ్యశ్రీ (ఉపమాక), ఎం.దివ్యశ్రీ (కోనవానిపాలెం), జి.లలిత (గుర్రాజుపేట), ఎస్.సాత్విక (నక్కపల్లి), బి.విశ్వ (డిఎల్‌పురం), కె.చరణ్ (చినతీనార్ల), ఆర్.తాతారావు (గునిపూడి), కె.శ్రీను (సీతంపాలెం) అస్వస్థతకు గురయ్యారు. వీరితోపాటు మరో ఇద్దరు ఉన్నారు. రాత్రిపూట పడుకునే ముందు ఇచ్చే ఇంజక్షన్ చేసిన కొద్ది నిమిషాలకు వీరందరూ అస్వస్థతకు గురయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఎందుకు ఇలా జరిగిందో తెలియడం లేదని, ఇంజక్షన్‌ను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని డ్యూటీలో ఉన్న డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం వీరందరికీ అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు శిక్షణతో మెరుగైన బోధన



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

నర్సీపట్నం: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఉపాధ్యాయులకు తర్ఫీదునిస్తున్నట్లు పాఠశాల విద్య ఆర్జేడీ కె.విజయభాస్కర్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యం పెంపునకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. ఏ విధంగా బోధిస్తే విద్యార్థులకు అర్థమవుతుందనే అంశాలపై ప్రత్యేక రిసోర్స్‌పర్సన్ల ద్వారా శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని, శిక్షణ తీరు బాగుందన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు

చోడవరం: రావికమతం మండలం గుమ్మాలపాడు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతోనో బైక్ పైనున్న కసిరెడ్డి సంజయ్ తీవ్రగా గాయపడ్డాడు. ఎర్రబంద గ్రామానికి చెందిన సంజయ్ తన బైక్‌పై రావికమతం నుంచి ఎర్రబంద వెళ్తుండగా గుమ్మాళ్లపాడు ఎర్రచెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. సంజయ్‌కు కాలు విరిగింది. తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రావికమతం ఆస్పత్రికి తరలించారు.

ఏమో సార్.. మాకు కనబడదు!



'నన్ను ధరించు మీకు పునర్జన్మ ఇస్తాను' అని ఫ్లెక్సీలు అమర్చిన ప్రాంతంలోనే హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. 'ట్రిపుల్ రైడింగ్‌కు నో చెప్పండి' అని ప్రచార బోర్డులున్న చోటే ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నా.. వాహనచోదకులకు అవేమీ పట్టడం లేదు. ఫ్లెక్సీలను చూస్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల ప్రయత్నాలను నీరుగారుస్తున్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలు నడుపుతున్న ఈ దృశ్యాలు.. వాహనచోదకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం











దళితుల జీవనాధారం లాక్కోవద్దు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దళితులు

గొలుగొండ: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములపై కొందరు టీడీపీ నేతలు కక్షగట్టి ఆ భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పప్పుశెట్టిపాలెం దళితులు తహసీల్దార్‌కు మంగళవారం మొరపెట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పప్పుశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెం.75లో సుమారు 11 మంది దళితులు గత 30 ఏళ్లగా భూముల్ని సాగుచేస్తున్నారు. గత ప్రభుత్వం పేదలకు పట్టాల పంపిణీలో భాగంగా నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వీరికి డి పట్టాలిచ్చారు. ఈ ప్రాంతంలోనే జిరాయితీ భూముల్లో రంగురాళ్ల క్వారీలు ఉన్నాయి. దీంతో దళితులకు ఇచ్చిన భూముల్లో కూడా రంగురాళ్లుంటాయని, ఆ భూములకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలంటూ స్థానిక టీడీపీ నేతలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీనిపై పట్టాలు పొందిన దళితులు టీడీపీ నేతల కుయుక్తుల్ని అడ్డుకుని, తమ జీవనాధారాన్ని కాపాడాలంటూ తహసీల్దార్‌ను ఆశ్రయించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ జరిపి, దళితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

కె.కోటపాడు: స్థానిక మూడు రోడ్ల కూడలి సమీపంలో మంగళవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి బ్యాగ్‌ను పరిశీలించగా 8 కిలోల గంజాయి బయటపడినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలివి. మూడురోడ్ల కూడలి సమీపంలో పెందుర్తి వైపు వెళ్లే బస్టాప్ వద్ద హైదరాబాద్‌కు చెందిన వై.త్రినాథ్, పాండిచ్చేరికి చెందిన మణికంఠన్, తన్ అప్పన్, శేఖర్‌ల కదలికలను అనుమానాన్ని రేకెత్తించాయి. దీంతో పోలీసులు వీరిని పట్టుకున్నారు. వీరు హుకుంపేట నుంచి తీసుకువస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి అక్రమ తరలింపునకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

రేసు రసవత్తరం

- రేపటి నుంచి నాకౌట్ పోటీలు
- లయన్స్‌తో కింగ్స్, వారియర్స్‌తో రైడర్స్ ఢీ



మ్యాచ్ బెస్ట్‌గా నిలిచిన వికెట్ కీపర్ లేఖజ్



అర్ధసెంచరీతో అజేయంగా నిలిచిన అభిషేక్



81 పరుగుల భాగస్వామ్యం అందించిన రషీద్, అభిషేక్ జోడీ

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. క్వాలిఫైయర్–1 మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్‌తో రాయలసీమ కింగ్స్ తలపడనుండగా.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్‌తో కోస్టల్ రైడర్స్ తలపడనుంది. క్వాలిఫైయర్–2 మ్యాచ్‌లో క్వాలిఫైయర్–1 ఓడిన జట్టుతో ఎలిమినేటర్‌లో విజయం సాధించిన జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు.. క్వాలిఫైయర్–1లో విజయం సాధించిన జట్టు టైటిల్ కోసం తలపడతాయి.

టైటాన్స్‌పై రైడర్స్ విజయం

పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో లీగ్ దశ చివరి రోజు మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్‌పై కోస్టల్ రైడర్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టైటాన్స్ పవర్ ప్లే ఆరు ఓవర్లలోనే 48 పరుగులు చేసినా కీలక నాలుగు వికెట్లు కోల్పోయింది. టైటాన్స్ ఓపెనర్ కెప్టెన్ జ్ఞానేశ్వర్(5) ఇన్నింగ్స్ రెండో బంతిని కవర్స్ మీదుగా బౌండరీకి తరలించినా..అదే ఓవర్ చివరి బంతికి స్టీఫెన్ బౌలింగ్‌లో వికెట్ల వెనుక లేఖజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అతని స్థానంలో వచ్చిన హేమంత్ రెండో ఓవర్‌లో వరసగా రెండు బంతులను బౌండరీకి తరలించినా చివరి బంతికి ప్రమోద్ బౌలింగ్‌లో వికెట్ల వెనుక లేఖజ్‌కే దొరికిపోయాడు. మరో ఓపెనర్ వంశీకృష్ణ (29) రనౌటై వెనుదిరిగాడు. సందీప్ (7), పాండురంగరాజు డకౌట్‌గానే పెవిలియన్‌కు చేరారు. ప్రసాద్(15), సమన్విత్(22), శశికాంత్(24) ఇన్నింగ్స్‌ను సరిదిద్దే ప్రయత్నం చేశారు. ప్రమోద్ మూడు వికెట్లు, ఆశిష్ రెండు వికెట్లు తీయడంతో చివరికి 17.1 ఓవర్లలోనే 138 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా 18 ఓవర్లకు మ్యాచ్‌ను కుదించారు. బ్యాటింగ్ ప్రారంభించిన రైడర్స్ ఓపెనర్ అర్జున్ టెండూల్కర్(19) 25 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. రైడర్స్ సయితం పవర్‌ప్లేలో 48 పరుగులే చేసినా ఒక వికెటే కోల్పోయింది. స్టేడియంలో మరోసారి వర్షం కురిసే అవకాశం ఉండటంతో వీజేడీ పద్ధతి దృష్టిలో పెట్టుకుని రైడర్స్ తొమ్మిది ఓవర్లకు 59 పరుగులు చేయాల్సి ఉండగా.. రషీద్ స్కోర్‌ను 69కి చేర్చాడు. రషీద్(39) శశికాంత్ బౌలింగ్‌లో తేజకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో వికెట్‌కు అభిషేక్‌తో కలిసి 81 పరుగులు జోడించాడు. విజయానికి మరో మూడు పరుగులు చేయాల్సిన స్థితిలో వర్ధన్(15) విజయ్ బౌలింగ్‌లో రాజుకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. లేఖజ్ డకౌటయ్యాడు. అభిషేక్(61) అర్ధసెంచరీతో అజేయంగా నిలిచి జట్టును నాకౌట్‌కు చేర్చాడు. రైడర్స్ 17.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. తేజ రెండు వికెట్లు తీశాడు.

గర్జించిన లయన్స్

లీగ్ చివరి మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఏడు వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. లీగ్ పాయింట్ల పట్టికలో ఆధిక్యమే లక్ష్యంగా ఉత్తరాంధ్ర లయన్స్ ఆది నుంచే పట్టు బిగించింది. దీంతో టైగర్స్ తొలి నాలుగు వికెట్లను 54 పరుగులకే కోల్పోయింది. ఓపెనర్ ధృవ్ కుమార్(70) మరో ఎండ్‌లో సహకారం లేక వికెట్లు కోల్పోతున్నా.. అర్ధసెంచరీ నమోదు చేశాడు. రాహుల్(32)తో కలిసి ఐదో వికెట్‌కు 55 పరుగులు జోడించాడు. వీరిద్దరూ మినహా మరే బ్యాటర్ రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. ముగ్గురు ఏకంగా రనౌటై పెవిలియన్‌కు చేరారు. తేజస్వి రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా బ్యాటింగ్ దిగిన లయన్స్ కూడా 30 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ తరుణ్ 15 పరుగులు చేశాడు. రాహుల్(38)శ్రీనివాస్(40 నాటౌట్) ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు. చివరికి మరో నాలుగు బంతులుండగానే లయన్స్ విజయలక్ష్యాన్నందుకుంది. లీగ్‌లో టైగర్స్ ఐదు మ్యాచ్‌ల్లోనూ పాయింట్ల ఖాతా ప్రారంభించకుండానే మూడో సీజన్ ముగించింది. నాకౌట్ పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రత, ఆధునీకీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు రీ షెడ్యూల్ చేస్తున్నట్లు, మరి కొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఈ నెల 11న మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరాల్సిన భువనేశ్వర్ – ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 45 నిమిషాలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.55 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 13న మధ్యాహ్నం 11.15 గంటలకు పూరిలో బయల్దేరాల్సిన పూరి – గాంధీదామ్ (22974) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటున్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12.45 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 13న మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరాల్సిన భువనేశ్వర్ – తిరుపతి (22879) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 45 నిమిషాలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.55 గంటలకు బయల్దేరుతుంది.

మాదక ద్రవ్యాల పట్టివేత

- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు
- ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయి స్వాధీనం

విశాఖ సిటీ: మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముఠాకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ పెట్టారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అయితే మూడు రోజుల క్రితమే పోలీసులు నిందితులను పట్టుకున్నప్పటికీ.. ఆ విషయాన్ని ఇప్పటి వరకు బయటపెట్టలేదు. గోప్యంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. విశాఖ మీదుగా డ్రగ్స్ తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. దీంతో వారు గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం నిఘా పెట్టారు. ఈ సమయంలో తంగేటి భరత్, రామ్‌ప్రసాద్, శ్యాంసుందర్, గుర్రపు యశ్వంత్‌లను పట్టుకున్నారు. వీరిలో భరత్, రామ్‌ప్రసాద్‌లు పాత నేరస్తులు. గతంలో పలుమార్లు ఇదే తరహా కేసుల్లో అరెస్టయ్యారు. వీరి వద్ద ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎండీఎంఏను కేరళ నుంచి, లిక్విడ్ గంజాయిని పాడేరు నుంచి సేకరించినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఈ కేసును పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కేసు వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

ఇరిగేషన్ ఈఈ కోనాం రిజర్వాయర్ సందర్శన



గేట్ల లీకేజీలపై సిబ్బందిని ఆరా తీస్తున్న ఈఈ త్రినాథం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయాన్ని ఇరిగేషన్ ఈఈ త్రినాథం మంగళవారం సందర్శించారు. ఈ మేరకు ఎగువ, దిగువ కాలువల ప్రధాన గేట్ల ట్రైల్ రన్ నిర్వహించారు. ఖరీఫ్ నీటి విడుదలపై నీటి నిల్వలను పరిశీలించారు. స్పిల్‌వే గేట్ల రబ్బరు దెబ్బతినడంతో నీటి లీకేజీలు జరుగుతున్నట్లు గుర్తించారు. జలాశయంపై నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట డీఈ, ఏఈలు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



అప్పలనాయుడు (ఫైల్)



విలపిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్) ఆస్పత్రిలో అప్పలనాయుడి మృత దేహం

బుచ్చెయ్యపేట: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన మరిసా అప్పలనాయుడు(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి బ్యాంకులు, ప్రవేటు వ్యక్తుల వద్ద సుమారు రూ.18 లక్షల అప్పు ఉంది. దీనిపై వడ్డీల భారం, కుటుంబ పోషణ గడవక జీవితంపై విరక్తి చెంది సోమవారం తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలివి. మృతుడు అప్పలనాయుడికి ఎకరం సొంత భూమి ఉండగా, మరో రెండెకరాలు కౌలు చేస్తున్నాడు. ఈ మూడెకరాల్లో కూరగాయలు, వరి పండిస్తూ, జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అప్పులు చేసి ఇల్లు కట్టాడు. వ్యవసాయ పెట్టుబడులకు బ్యాంకుల్లో, ఇతరుల వద్ద అప్పులు చేశాడు. రాజాం కెనరా బ్యాంకు, తురకలపూడి కోఆపరేటివ్ బ్యాంకులో సుమారు రూ.3 లక్షలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల వద్ద రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. వ్యవసాయం కలిసి రాక పోగా, అప్పుల భారం పెరిగింది. దీంతో మానసికంగా కుంగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇంటర్ చదువుతున్న కుమారుడు సాయి, 4వ తరగతి చదువుతున్న కుమార్తె పూజిత, ఇతని మీదే ఆధారపడ్డ తల్లి కొండమ్మ ఉన్నారు. బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి.ఈశ్వరరావు రైతు మృతిపై కేసు నమోదు చేసి, అనకాపల్లిలోనే పోస్టుమార్టమ్ నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు బుధవారం అందించనున్నట్లు తెలిపారు.

విశాఖ - విజయనగరం ప్రయాణికులపై టోల్ భారం



తగరపువలస(విశాఖ): భీమిలి శివారులో ప్రారంభమయ్యే రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారి (పాతది 43, కొత్తది 26)పై బోడమెట్టపాలెం వద్ద పది రోజుల క్రితం ప్రారంభించిన టోల్‌గేట్ ప్రయాణికులకు భారంగా మారింది. వాస్తవానికి ఈ టోల్‌గేట్ విజయనగరం – రాయ్‌పూర్ పట్టణాల మధ్య కొత్త జాతీయ రహదారికి సంబంధించినది. భీమిలి మండలం బోడమెట్టపాలెంను ఆనుకుని విజయనగరం జిల్లా జొన్నాడ పేరుతో టోల్ తీస్తున్న దీనిని ఇరు పట్టణాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. విశాఖ నుంచి విజయనగరం వెళ్లినా, రాయ్‌పూర్ వెళ్లినా ఇక్కడ టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారు. కానీ విజయనగరం నుంచి బయలుదేరి రాయ్‌పూర్ వెళ్లేవారికి ఈ టోల్‌గేట్ బెడద ఉండదు. ఇది జాతీయ రహదారుల సంస్థకు చెందినది కాబట్టి విజయనగరం – రాయ్‌పూర్ మార్గంలోనే ఉండాలంటున్నారు. కానీ భీమిలి మండలానికి ఆనుకుని నిర్మించడం వల్ల విశాఖ – విజయనగరం ప్రయాణికులపై కొత్త భారం పడింది. ఇటీవల ఆనందపురం – అనకాపల్లి మార్గంలో దుక్కవానిపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా నుంచి స్థానికులకు మినహాయింపు ఇస్తూ సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేశారు. బోడమెట్టపాలెం వద్ద మాత్రం మినహాయింపు ఇవ్వకుండా కారుకు రూ.60, వ్యాన్‌కు రూ.95, బస్సుకు రూ.195, ఇతర పెద్ద వాహనాలకు రూ.215 నుంచి రూ.370 వరకు ఒకవైపు వసూలు చేస్తున్నారు. టోల్‌గేట్‌కు అటు, ఇటువైపు కేవలం 2 కిలోమీటర్ల పరిధిలోనే ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. దీంతో కార్లపై వచ్చేవారికి, తగరపువలస, విశాఖ నుంచి వివిధ పనుల మీద విజయనగరం వచ్చేవారికి భారంగా మారడంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రజాసంఘాలు, ప్రభుత్వాల ప్రతినిధులు జోక్యం చేసుకుని ఈ టోల్‌గేట్‌ను తగరపువలస – విజయనగరం మధ్యలో కాకుండా విజయనగరం – రాయ్‌పూర్ మార్గంలోకి మార్చాలని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

నూతలగుంటపాలెంలో దొంగలు పడ్డారు



దొంగలు బీరువాలో చిందర వందర చేసిన వస్త్రాలు



నూతలగుంటపాలెంలో దొంగతనం జరిగిన పిల్లి సుందరరావు ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ బృందం

- ఒకే రోజు రాత్రి 9 ఇళ్లలో ప్రవేశించిన దొంగలు
- ఒక ఇంట్లో తులంన్నర బంగారం చోరీ

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో ఒకే రాత్రి 9 ఇళ్లలో దొంగతనాలు జరుగగా, ఒక ఇంట్లో మాత్రం తులంన్నర బంగారం, రూ.20 వేల నగదు తస్కరణకు గురైంది. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అగంతకులు దొంగతనాలకు పాల్పడ్డారు. ఇళ్లలో ప్రవేశించి సామాన్లను చిందర వందర చేశారు. విషయం తెలియడంతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. అనకాపల్లి–యలమంచిలి మార్గంలో జాతీయ రహదారి పక్కనున్న ఈ గ్రామంలో తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన 9 ఇళ్లను దొంగలు గుర్తించారు. వాటి తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించారు. బీరువాలు తెరిచి అందులోని వస్త్రాలను చిందర వందర చేశారు. అదృష్టవశాత్తు ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ పిల్లి సుందరరావుకు చెందిన ఇంట్లో తప్ప మిగిలిన ఇళ్లలో ఎటువంటి నగదు, బంగారం చోరీకి గురవలేదు. సుందరరావు ఆదివారం ఇంటికి తాళం వేసి విశాఖ వెళ్లారు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండటం గమనించారు. బీరువాలో వస్త్రాలు చిందర వందరగా పడి ఉండటాన్ని చూసి, అరలు పరిశీలించగా తులంన్నర బంగారు ఆభరణాలతోపాటు రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు కలిగెట్ల మహాలక్ష్మినాయుడు, కోరుకొండ మారయ్య, బొండా నారాయణమూర్తి, అగ్రహారపు శ్రీనివాసరావు, చిక్కాల రమణమ్మ, చిక్కాల రమణ, కలం గైరమ్మ, కారెడ్డి చిన్నమ్మలు ఇళ్లకు తాళాలు వేసి సొంత పనుల మీద, బంధువుల ఇళ్లకు, తీర్థ యాత్రలకు వెళ్లడంతో, వారి ఇళ్ల తాళాలనూ కోసి, దొంగతనానికి ప్రయత్నించారు. వీరిలో చిన్నమ్మలు షిర్డీ వెళ్లి మంగళవారమే తిరిగి వచ్చి, పరిశీలించగా ఇంటిలో దొంగలు పడిన సంగతి గుర్తించారు. ఎటువంటి వస్తువులు పోలేదని తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్‌ఐ రమేష్‌బాబు సందర్శించి, దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ బృందం వచ్చి ముద్రలు సేకరించారు. సుందరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

12న కన్యకాపరమేశ్వరికి శాకంబరి అలంకరణ

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీకన్యకాపరమేశ్వరిదేవిని ఆషాఢ మాసం సందర్భంగా ఈ నెల 12న శాకంబరీదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా కోరారు.

14న నవోదయ మోడల్ పరీక్ష

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదురుగా బాసర అకాడమీలో ఈ నెల 14న కనెక్ట్ టు సొసైటీ అండ్ సైన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రతినిధి దొడ్డి నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ తరగతి విద్యార్థులైనా ఈ పరీక్ష రాయవచ్చన్నారు. అత్యంత ప్రామాణికతతో కూడిన ప్రశ్నాపత్రం అందిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామన్నారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి రాజా కంటి ఆస్పత్రి ఆవరణలో ఈ నెల 15న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధి పూసర్ల రాజా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులచే ఈ కంటి పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఆపరేషన్‌కు ఎంపికైన రోగులకు శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. వివరాలకు 9032223330 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు



కశింకోట: దేవదాయ శాఖకు చెందిన స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు జరిపారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై, స్వామిని దర్శించుకున్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
హనీమూన్ ఎక్స్‌ప్రెస్	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 105 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,410	4,660
రెండో రకం	4,160	4,160
మూడోరకం	3,200	3,610

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 374 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు మన హక్కు

కాలం మారింది. వేగం పెరిగింది. వాహనం లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి. వాహనం నడవాలంటే ఇంధనం తప్పనిసరి. దీంతో ఏ పెట్రోల్ బంకు వద్ద చూసినా వాహనాల రద్దీ. ఇంధన ధరల్లోనే పెట్రోల్ బంక్ యాజమాన్యాలు వాహన టైర్లకు ఉచిత గాలి, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలను అందించాలి. అయితే అనకాపల్లి పట్టణ పరిధిలోని బంకుల్లో చాలా వరకు ఆ పరిస్థితి లేదు. ప్రజల ఇక్కట్లను పట్టించుకునే నాథుడూ లేడు.

- పట్టణ, మండల పరిధిలో 10 పెట్రోల్ బంకులు
- కనీస సౌకర్యాలు పట్టని బంకు యాజమాన్యాలు
- పట్టించుకోని లీగల్ మెట్రాలజీ, పోలీస్, రెవెన్యూ అధికారులు



విజయరామరాజుపేట వద్ద పెట్రోల్ బంకులో వాహనదారులు

అనకాపల్లి: సాధారణంగా మనం పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాలకు పెట్రోల్/డీజిల్ పోయించుకుని వెళ్లిపోతాం. ఈ బంకుల్లో పెట్రోల్‌తోపాటు మరి కొన్ని సేవల్ని కూడా పొందే హక్కు మనకు ఉంది. ఇంధన పన్ను శాతాల్లో మార్పు లేకపోయినా ధరలు పెరిగిన ప్రతిసారీ వినియోగదారుల జేబుల నుంచి ఈ సౌకర్యాల కోసం వసూళ్లు తప్పనిసరి. ప్రస్తుతం లీటరుపై 5-10 పైసలు బంకుల్లో వినియోగదారులకు అందించాల్సిన సేవల కోసం వసూలు చేస్తారు. అయితే ఆ సేవలు అందిస్తున్న బంకులు మాత్రం మచ్చుకైనా కానరావు. ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్తారన్న ఆరోపణలు కోకొల్లలు.

అందించాల్సిన సేవలు

పట్టణ, మండల పరిధిలో 10 పెట్రోల్ బంకులున్నాయి. వీటిన్నింటిలోనూ ఇదే పరిస్థితి. వాస్తవంగా ప్రతి బంకులో వాహనాలకు టైర్లలో ఉచితంగా గాలి నింపాలి. శుద్ధి చేసిన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విశ్రాంతి గది, ప్రథమ చికిత్స కిట్, అత్యవసర సమయంలో వినియోగించుకునేందుకు వీలుగా ఫోన్ సౌకర్యం, ఇంధన కొలతలపై సందేహ నివృత్తి కోసం కొలత పాత్రలు, నాణ్యతను పరీక్షించే సామగ్రి, కంప్లైంట్ బాక్స్ తప్పనిసరి. టీ-స్నాక్స్ పాయింట్ కూడా ఏర్పాటు చేయాలి. ఈ సౌకర్యాలేవీ ఇక్కడి బంకుల్లో కానరావు. చాలా చోట్ల బంకుల మరుగుదొడ్లకు తాళాలు బిగించేస్తున్నారు.

అన్నింటికీ వసూళ్లే

ఉచితంగా అందించాల్సిన సేవలకు కూడా బంక్ యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ప్రశ్నించే వాహనదారులపై దౌర్జన్యాలకు పాల్పడిన దాఖలాలున్నాయి. ఇప్పుడు ట్యూబ్‌లెస్ టైర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి బంక్‌లో నైట్రోజన్ గ్యాస్ టైర్లలో నింపే ఏర్పాట్లు ఉండాలి. కనీసం టైర్లలో గాలి ఉచితంగా నింపాలి. స్థానిక బంకుల్లో డబ్బులిస్తే తప్ప టైర్లలో గాలి కొట్టని పరిస్థితి. తాగునీరందించాల్సిన స్థానంలో వాటర్ బాటిళ్ల విక్రయిస్తూ బంకు యజమానులు అదనంగా ఆర్జిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే వీలేలేదు. ఫిర్యాదు చేసేందుకు నోటీస్ బోర్డు కానరాదు. ఉన్నా అందులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ అధికారి ఫోన్ నంబర్ ఉండదు.

అవగాహన లేదు



పాతికేళ్ల నుంచి పలు వాహనాలను నడుపుతున్నాను. పెట్రోల్ బంకుల్లో కస్టమర్లకు అందించాల్సిన సేవల గురించి నాకు అవగాహన లేదు. పెట్రోల్ పోయించుకోవడమే తెలుసు. దాహం అనిపిస్తే చాలా సార్లు బంకుల్లోనే వాటర్ బాటిళ్లు కొన్నా. గాలి కొట్టించినపు డబ్బులు తప్పనిసరి. ఈ మధ్యకాలంలో కొన్ని బంకుల్లో మాత్రం టైర్లకు గాలి ఫ్రీగా ఎక్కిస్తున్నారు.

– వి.చంద్రరావు, వాహనదారుడు, అనకాపల్లి

నిబంధనలు పాటించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలి. మరుగుదొడ్లు, పరిశుభ్రమైన తాగునీరు అందించాలి. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు అధికారులు నిత్యం బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. లోపాలుంటే హెచ్చరిస్తారు. సరిదిద్దుకోకపోతే వారికే నష్టం. ప్రత్యేకించి ఫిర్యాదులు వస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– వై.శ్రీరామ్మూర్తి, డిప్యూటీ తహసీల్దార్, అనకాపల్లి

నెలరోజులైనా అలాగే వదిలేశారు..



యండపల్లి శివారున కూలిన భారీ వృక్షం

కోటవురట్ల : ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ఇటీవల కూలిన భారీ వృక్షాలను నెలల తరబడి తొలగించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల తీరుపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యండపల్లి శివారున ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నాలుగు భారీ వృక్షాలు నెలరోజుల క్రితం కూలిపోయాయి. ఈ వృక్షాలను తొలగించకుండా అలాగే వదిలేయడంతో వాహనచోదకులు ఆదమరుపుగా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా ఎంతో విలువైన కలప ఎందుకూ కొరగాకుండా పోయే ప్రమాదం ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు కూలిన వృక్షాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రోటరీ కంటి ఆస్పత్రి ప్రతినిధి రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు ఆస్పత్రి ప్రతినిధి రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 45 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా, 8 మందిని ఐవోఎల్ ఆపరేషన్‌కుక ఎంపిక చేశామన్నారు. వీరికి కంటి వైద్యులు కె.మల్లేశ్వరరావు, అరుణ్‌లు శస్త్ర చికిత్సలు చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం 5 రోజులకు సరిపడా మందులు అందించామన్నారు.

ఆశాజనకంగా నువ్వుపంట



పాములవాకలో పచ్చగా కళకళలాడుతున్న నువ్వుచేను

కోటవురట్ల : నువ్వుపంట సాగు ఆశాజనకంగా ఉంది. కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నువ్వుచేలు పచ్చగా కళకళలాడుతున్నాయి. మండలంలో నువ్వు పంట సుమారు 70 ఎకరాల్లో సాగులో ఉంది. మెట్ట ప్రాంతాల్లో అధికంగా సాగులో ఉండగా ఏపుగా పెరిగి పక్వానికి చేరుకుంటోంది. పాములవాక, నీలిగుంట, రామచంద్రపాలెం, బి.కె.పల్లి, పి.కె.పల్లి, చినబొడ్డేపల్లి, కె.వెంకటాపురం, లింగాపురం, తిమ్మాపురం, సన్యాసిరాజుపాలెం తదితర ప్రాంతాలలో నువ్వు పంట అధికంగా సాగులో ఉంది.

సాగర్ కవచ్ నిర్వహణపై సమీక్ష

అచ్యుతాపురం : ఈ నెల 10,11వ తేదీల్లో సముద్ర తీరంలో నిర్వహించనున్న సాగర్‌కవచ్‌కు సంబంధించి మంగళవారం అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు సమీక్ష చేపట్టారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన సమీక్షలో భాగంగా పోలీసులు ముందస్తు ప్రణాళికలపై చర్చించారు. సముద్ర తీరంలోకి తీవ్రవాదులు వస్తే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ఈ సమీక్షలో అవగాహన కల్పించారు.

ఘనంగా నల్లమారమ్మ పండగ



నల్లమారమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఆటో యజమానులు

మునగపాక : మండల కేంద్రంలో మంగళవారం నల్లమారమ్మ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మునగపాకకు చెందిన ఆటో యజమానులు, డ్రైవర్లు ఉదయం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వరకు సందడి చేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన చూడి ఆవు

సబ్బవరం: పైడివాడ అగ్రహారం గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో విద్యుదాఘాతానికి గురై చూడి ఆవు మృత్యువాత పడింది.వివరాలు.. గ్రామానికి చెందిన పెచ్చేటి కనకరాజుకు చెందిన చూడి ఆవు ఆలయం సమీపంలో మేతకు వెళ్లింది. అయితే అదే సమయంలో విద్యుత్ ఎల్‌టీ లైన్‌కు చెందిన వైరు తెగిపడి ఆవు కాళ్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. చూడి ఆవు ఖరీదు సుమారు రూ. 60 వేలు ఉంటుందని రైతులు చెబుతున్నారు.విద్యుత్ సంస్థ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత



గతుకులు పూడ్చుతున్న స్థానికులు

ఎస్.రాయవరం : మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును పలువురు వాహన చోదకులు శ్రమదానంతో గతుకులు పూడ్చారు. ఈ రోడ్డు పి.ధర్మవరం సమీపంలో గతుకులు పడడంతో ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు తరచూ ఇబ్బందులు పడేవారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కొందరు శ్రమదానంతో గోతులు పూడ్చారు. దీంతో వాహన చోదకులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

వరాహావతారంలో జగన్నాథుడు



మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి మంగళవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 15వ తేదీన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని మండల లీగల్ సెల్ కమిటీ ప్రతినిధులు కోరారు. జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య ఆదేశాల మేరకు లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక న్యాయస్థాన సముదాయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా రింగ్‌రోడ్డు వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి, ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం.. ప్రమాదాలను అరికడదాం.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎ.రమేష్, బీవీ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సొంతంగా పశుగ్రాసంతో అధిక రాబడి



అచ్చెర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు సంవర్థక శాఖ డీడీ డాక్టర్ చంద్రశేఖర్

కశింకోట: రైతులు పశు గ్రాసం పెంచడం పట్ల దృష్టి నిలపాలని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని అచ్చెర్లలో పశుగ్రాస వార్షికోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగ్రాసం పెంచుకోవాల్సిన అవశ్యకతను వివరిస్తూ రైతులకు అవగాహన కలిగించారు. సొంత భూమి కలిగి ఉన్న పాడి రైతులు పశు గ్రాసం పెంచడం ద్వారా అధిక రాబడి చేకూరుతుందన్నారు. ఆరోగ్యకరమైన పశు గ్రాసంతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. తద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి : ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల నాయకుడు శివాజీ, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళారం యలమంచిలి మండలం ములకలాపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 9 వారాల బకాయిలు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని వాటిని వెంటనే విడుదల చేయాలని, గతంలో వేసవి అలవెన్సు మహిళలకు గునపాం, పారకి తట్టకీ, మంచినీటికి నగదును కార్మికుల ఖాతాల్లో వేసేవారని ఇప్పుడు ఆ పద్ధతిని పూర్తిగా రద్దు చేశారని అన్నారు. పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి నీడను ఏర్పాటు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలేవీ అందించడం లేదని ఆరోపించారు. గతంలో వారం వారం స్లిప్పులు ఇచ్చేవారని, 15 రోజులకు కూలీలకు పేమెంట్‌లు చెల్లించేవారని తెలిపారు. 2014 సంవత్సరం నుంచి 200 రోజులుకు రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని అప్పట్లో డిమాండ్ చేయడం జరిగిందని, తమ పోరాట ఫలితంగా 300 రూపాయలు చెల్లిస్తున్నారని అన్నారు. మహిళలకు వేసవి అలవెన్సులు వెంటనే చెల్లించకపోతే ఎంపీడీవో కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. తొమ్మిది వారాల బకాయిలు చెల్లించి ఉపాధి హామీ కూలీలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు సిఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం

ఏపీటీఎఫ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటపతిరాజు

నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వకార్యదర్శి వెంకటపతిరాజు అన్నారు. మంగళవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును ఆయన నక్కపల్లి మండలంలో పలు పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ కొండలరావు, ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, పూర్వగౌరవాధ్యక్షుడు సింహాచలం, నాయకులు అప్పలరాజు, కృష్ణ, సూర్యారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

11న వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 11న వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరుగుతుందని తోసా(తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సైకాలజిస్టు జె.ఎస్.వి.రావు ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్టు వీకేవీకే కళాధరావు ఆధ్వర్యంలో అదే రోజు యోగా–ఆరోగ్యంపై అవగాహన, అలాగే టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ ఉంటుందన్నారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించడంలో కృషి చేసిన హెచ్‌ఎం అప్పారావుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటప్పారావు కోరారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



మల్లవరంలో బ్లీచింగ్ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ హేమలత



డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌వో దేవకాంత



ఖాజీపాలెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ సీజన్‌లో రోగాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత కోరారు. మండలంలోని మల్లవరంలో రోగాలు సంభవించకుండా మంగళవారం బ్లీచింగ్ పిచికారీ పనులను చేయించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ప్రజలు ఉండాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో దేవకాంత కోరారు. మునగపాకలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలల పాటు రోగాలు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పిచికారీ పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అలాగే 5 ఏళ్ల లోపు పిల్లలకు డయేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం దేవకి, వెలుగు ఏపీఎం కొండమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కళ్యాణి అన్నారు.మండలంలోని ఖాజీపాలెంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీ, అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సీజన్లో డెంగ్యూ, అతిసార, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, రామలక్ష్మి, సునీత, ఉమా మహేశ్ తదితర పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ విధానాలే 'ఉక్కు' దుస్థితికి కారణం

అగనంపూడి: పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అవలంభించిన విధానాలు, ఉక్కు కర్మాగారానికి సహాయ నిరాకరణ వల్ల ఉక్కు పరిశ్రమకు ఈ దుస్థితి ఎదురైందని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 1244వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు నష్టాల్లో ఉందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ప్రకటించడం అన్యాయమన్నారు. అది అవాస్తవమన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తామని ప్రకటించే వరకు ఉక్కు పరిస్థితి ఆశాజనకంగా ఉండేదని తెలిపారు. అలాంటి ఉక్కు ఊపిరి తీసి, వారి అనుయాయులకు అప్పగించాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలో కేంద్ర సహాయ మంత్రి కూడా భాగస్వాములు కావొద్దని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.